# 19. పెట్టుబడిలేని పరిశ్రమ

మనకున్న కుటీర పరిశ్రమల్లో కెల్లా దమ్మిడీ పెట్టుబడి అక్కర్లేనిది జ్యోతిష్యం, జ్యోతిష్యం మీద బ్రతికేవారు ఈ దేశంలో కనీసం కొన్ని లక్షల మంది ఉంటారు. దానిని నమ్ముకుంటూ బ్రతికే వారి సంగతి సరేసరి: వారి సంఖ్య కోట్లలో ఉండాల్సిందే !

సమస్యలంటూ లేని నిక్షేపరాయుళ్ళీ దేశంలో లేరు ఏమీ లేనివాడికి ఆ పూటకు కడుపు నిండటం అనేదో సమస్య. కాస్త ఉన్నవాడికి రేపు ఎలా ఉంటుందనేది 'జీవన్మరణ సమస్య. అన్నీ ఉన్నవాడి సమస్య కాస్త ఖరీదయినది. తిన్నది సరిగా అరుగుతుందా లేదా అనే అల్ప సమస్యల నలా ఉంచి బ్యాంక్ బ్యాలన్స సదా పెరుగుతూండకపోతే పాపం వాడికి నిద్రే పట్టదు.

మన జానపద సినిమాల్లోని మాంత్రికులకు మాత్రం సమస్యలుండవు. వారి చేతుల్లోని మంత్రదండాలు ఏలాంటి సమస్యలైనా చిటికెలో తీర్చేస్తాయి. కొండ మీది కొండ ముచ్చునే గాదు; అంతఃపురంలోని రాకుమార్తెనూ, రాజా వారి ఖజానాలోని వజ్రవైడూర్యాల్ని అమాంతం తెచ్చి

మాంత్రికుని కాళ్ళముందు పడేస్తాయి. అలాంటి మంత్రదండం తనకూ ఒకటి దొరికితే బాగుండునని కోరుకోని వారు ఈపూట సమస్యల, రేపటి సమస్యల, బ్యాంక్ బ్యాలన్స్ సమస్యల భారతీయుల్లో ఎవరుంటారు చెప్పండి. అసలు మన వాళ్లు దేవుడి ముందు సాష్టాంగదండ ప్రమాణాలు చేసినా, గుంజీలు తీసినా, గుండ్లు కొట్టించుకున్నా అవన్నీ ఈ మంత్ర దండాలకోసమే గదా।

కానీ, సదరు మంత్రదండాల హోల్‌సేల్ డీలరయిన దేవుడుగారు ఈ కలికాలంలో ఏడు కొండలూ ఎక్కి తల క్రిందులుగా తపస్సు చేసినా సినిమాల్లో తప్ప మరెక్కడా ప్రత్యక్షం కావటం లేదు.

కనుక సదరు మంత్రదండాల రిటైల్ డీలర్లలాంటి, సదరు దేవుడుగారి భూలోక బ్రోకర్లలాంటి జ్యోతిష్కుల బిజినెస్ ఆంధ్రోద్యమకాలంలో సోడాబుడ్డ వ్యాపారంలా వెలిగిపోతున్నందుకు మనం అసూయపడగూడదు.

తెల్లారే ఏ చెట్టు క్రిందో పట్టెనామాల్తో ప్రత్యక్షమై కేవలం పావలా డబ్బులికి మంత్రదండా లెక్కడున్నదీ, అవి ఎప్పుడు ఎలా మనకు దొరికేదీ అన్నీ వివరించి, అందు కవసరమైన గ్రహశాంతులూ గట్రా విడమర్చి చెప్పే ఈ ఆధునిక కుటీర పరిశ్రమాధిపతులకు ఇంతవరకూ మన ఏలిన

వారు పద్మశ్రీల్లాంటి తగు సన్మానా లేవీ ప్రకటించకపోవటం శోచనీయం.

ఆ మధ్య ఓ సుప్రసిద్ధ జ్యోతిషుల వారు ఓ దినపత్రికలో అడ్వర్టయిజుమెంటు రూపంలో తన మాహాత్మ్యాన్ని గురించి ఘనంగా చెప్పుకున్నారు. స్వంత డబ్బా అని ఎవరన్నా అంటారేమోనని గాబోలు, దానితోపాటు ఓ కేంద్ర మంత్రిగారి సర్టిఫికేటును కూడా ప్రకటించుకున్నారు. ఆ మంత్రిగారి విషయంలో ఈ జ్యోతిషులవారు చెప్పినవన్నీ వాటర్ బాంబ్ అంటే బెజవాడ సోడాబుడ్డీయే నన్నంత కరెక్టుగా నిజమయ్యాయట.

హీరోయిన్‌తో డ్యూయెట్లు పాడే హక్కు హీరోకే తప్ప విలన్‌కు లేనట్టు ఆ అదృష్టం కొందరిదే.

మొన్నీ మధ్యే ఓ పెద్ద మనిషి కోర్టు కెళ్ళి మరీ జ్యోతిష్య ప్రభావాన్ని నిరూపించుకు వచ్చాడు. ఆయనగారికి ఓ జ్యోతిష్యుడు బల్లగుద్ది మరీ సెలవిచ్చాడట. "ఫలానా నెలలో, ఫలానా తేదీన నిన్ను పట్టుకు పీడిస్తున్న శనిగ్రహాలన్నీ హైస్కూల్ కుర్రాళ్ళ చేతుల్లో 'మేడిన్ బెజవాడా వాటర్ బాంబ్' లను చూపిన సిఆర్పిలా చెల్లాచెదురయిపోతాయి. ఆ రోజున నీకు మహా ధనయోగం ఉంది. ప్రత్యేకాంధ్ర రాష్ట్రం వస్తుందో రాదో గానీ, ఆ రోజున మాత్రం నీ ఒళ్ళో కొన్ని లక్షలు వచ్చి వాలటం ఖాయం" అని.

సదరు పెద్ద మనిషి సంతోషించేడు. వెంటనే తనకు రానున్న లక్షల్లో తిరుపతి వెంకన్నకు టెన్ పర్సెంటును ఉదారంగా విరాళంగా ప్రకటించేసుకున్నాడు కూడా.

అయితే, ఏం చేయాలి? ఏమీ చెయ్యకుండా ఊరికే ఇంట్లో పై కప్పుకేసి చూస్తూ పడుకుంటే పై కప్పు నుండి లక్షలు రాలి పడతాయా ? ఒకవేళ అలా రాలినా ఇంటి ఓనర్ ఊరుకుంటాడా ? అదంతా నాదే! మా ముత్తాత నాకోసం పై కప్పులో పాతరవేసి ఉంచాడని లాక్కు పోడా ?

ఇలా ఆలోచిస్తుండగా సదరు పెద్ద మనిషికి అమోఘ మైన అయిడియా తట్టింది. లాటరీ టిక్కెట్ల డీలర్ వద్దకెళ్ళి అన్నీ తిరగేసి చూస్తే సరిగ్గా తనకు ధనయోగం ఉన్ననాడే డ్రా జరిగే లాటరీ ఒకటి తగిలింది. ఇంకేం ఆ టిక్కెట్లు కొన్ని కొని పాతరేశాడు. ఫస్ట్ ప్రైజు అయిదు లక్షలతో ఏమేం చేయాలో లిస్టులు వేశాడు. కానీ, పార్వతీదేవి శాపం ఉంది గదండీ! కనుక ఆయనగారి ఖర్మగాలి ఆ లాటరీ డ్రా తేదీ వాయిదా వేశారు. అవి అచ్చేసి అమ్మే పోలీస్ వెల్ఫేర్ ఫండ్ వాళ్ళు.

ఆ తేదీ అలా దాటిపోవటంతో, మన వాడికి గుండె గుభేలుమని, తర్వాత వళ్ళుమండి కోర్టుకు లాగాడు ఆ పోలీస్ వెల్ఫేర్ ఫండ్ వాళ్ళని.

"మహాఘనత వహించిన మా వీధి రావి చెట్టు క్రింది మెల్లకన్ను జ్యోతిష్యుడు నాకు ఫలానా తేదీన ధనయోగం ఉందని బల్లగుద్ది చెప్పాడు. అది నమ్మి నేను ఆ రోజూ, ఆ మర్నాడూ భోజనం కూడా మానుకుని ఆ డబ్బులతో మీ లాటరీ టిక్కెట్లు కొన్నాను. కానీ, మీరు డ్రా తేదీ వాయిదా వేశారు. అలాగాక టిక్కెట్టులో అచ్చేసిన తేదీనే డ్రా జరిపితే ఫస్టు ప్రయిజు అయిదు లక్షలూ మా సుప్రసిద్ధ మెల్లకన్ను జ్యోతిషులవారి ప్రవచన ప్రకారం నాకే వచ్చి ఉండేది. తేదీ మార్చి మీరు నమ్మక ద్రోహం చేశారు. గనుక నష్టపరిహారం ఇచ్చుకోండి" అని ఆ రిట్ పిటీషన్ సారాంశం.

మహాఘనత వహించిన మన సెక్యులర్ కోర్టువారు జ్యోతిష్యం పరువు కాపాడాలనుకున్నారో లేదో మనకు తెలీదు గానీ వారు మాత్రం సదరు వెల్ఫేర్ ఫండ్ లాటరీ టిక్కెట్ల అమ్మకాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తూ ఓ ఆర్డర్ మాత్రం జారీ చేశారు.

ఆ మధ్య గవర్నమెంట్ కోటాలో స్కూటర్ కోసం అప్లికేషన్ పెట్టుకున్న మావాడొకడు ఎందుకైనా మంచిదని ఓరోజు లంచ్ టైంలో జ్యోతిష్యం చెప్పించుకున్నాడో పావలా ఇచ్చి.

"నీ గ్రహాలన్నీ ఉచ్ఛస్థాయిలో ఉన్నా యిప్పుడు. నీకు ఈ వారంలోనే తప్పని సరిగా వాహనయోగం ఉంది!"

అని నశ్యంతో పనిలేకుండానే చెప్పేశాడా జ్యోతిష్యుడు.

మావాడు సంతోషించి మరో పావలా ఎక్కువే ఇచ్చి వచ్చాడు. ఆ సాయంత్రం వాడు కదిలే బస్సులోకి దూక బోయి బస్సు క్రిందికి దూకేశాడు తొందరలో.

తత్ఫలితంగా వాణ్ణి గవర్నమెంట్ వాహనం ఎక్కించి హాస్పిటల్లో అడ్మిట్ చేయించాల్సొచ్చింది.

మరి జ్యోతిష్యం విషయంలో మీకింకా అపనమ్మకా లేమన్నా ఉన్నాయా ?

(మే 1978)